# సింగిల్ పేజీ కథలు

**ఓ టీవీ ఛానెల్ నిర్వహిస్తున్న పాటల కార్యక్రమంలో పాల్గొంటున్న మా అమ్మాయికి తోడుగా హైదరాబాదు వచ్చాము నేనూ, నా భార్య రాధిక.**

షూటింగ్ పూర్తయ్యాక తిరిగి తిరుపతి ప్రయాణమయ్యాము ముగ్గురం. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం సుఖంగానే సాగింది మరుసటి రోజు ఉదయం వరకూ.

ప్రొద్దున ఆరు గంటలకు నిద్రలేచి బ్రష్ చేసుకుని, ముఖం కడుక్కుని వస్తూంటే కనిపించారు ఓ జంట. మా కూపేకు ప్రక్కనున్న కూపేలో సైడ్ బెర్త్‌మీద కూర్చుని ఉన్నారు వారు. ఒకేవైపు ఇరుక్కుని కూర్చుని వున్నారు ఇద్దరూ. అతడు కిటికీలోంచి బయట కనిపిస్తున్నదేదో చూపిస్తూంటే ఆమె నవ్వుతూంది.

'కొత్తగా పెళ్ళైన జంట కాబోలు' అనుకున్నాను. నా సీట్లో కూర్చుని నా ప్రక్కన కూర్చున్న అబ్బాయిని చూశాను. అతడు వారివంకే చూస్తున్నాడు. అతడు నిన్న సాయంత్రమే పరిచయమయ్యాడు. పేరు చైతన్య. హైదరాబాద్‌లో ఇంజనీరింగు మూడవ సంవత్సరం చదువుతున్నాడుట. తిరుపతిలోని తన మేనత్త ఇంటికి సెలవులు గడపటానికి వెళ్తున్నాడు.

మళ్ళీ ఆ జంటవైపు చూశాను. అతను తన తలని ఆమె భుజంపై ఆన్చి, ఆమె ఎడమ చేతిని తన రెండు చేతుల్తో గట్టిగా పట్టుకొని, తన చెంపకు ఆనించుకుని ఏదో చెప్తూంటే ఆమె ఆసక్తిగా వింటోంది. ఎందుకో ఆ దృశ్యం నాకు కాస్త ఇబ్బంది కలిగించింది.

చైతన్య కూడా తల తిప్పుకుని ఎటో చూస్తున్నాడు. అతనిక్కూడా బహుశా వాళ్ళ ప్రవర్తన ఎబ్బెట్టుగా అనిపించి ఉండొచ్చు. అదృష్టవశాత్తూ నా పదిహేనేళ్ళ అమ్మాయి మాత్రం కిటికీ దగ్గర కూర్చొని వుండటం వల్ల వీళ్ళ చేష్టలు ఆమె కంట్లో పడలేదు.

ఈమధ్య తరచుగా నాకు ఇటువంటి సన్నివేశాలు ఎదురవుతున్నాయి ప్రయాణాల్లో. 'సభ్యత' అన్నది మరచిపోతున్నారు మనుషులు అనుకున్నాను.

నా భార్యతో ఏదో పిచ్చాపాటీ మాట్లాడుతూ మళ్ళీ ఆ జంట వైపు చూశాను. ఈసారి సీను మారింది. అతడు తన తలని ఆమె ఒడిలో పెట్టుకుని పడుకుని ఉన్నాడు. ఆమె అతని తల వెంట్రుకల్ని సవరిస్తూంది. క్షణక్షణానికీ ఆ జంటపై ఏహ్యత పెరుగుతోంది నాలో. ఉదయం ఏడు గంటలకు అందరూ మెలకువగా కూర్చుని ఉండగా, అంత వయసొచ్చిన వాడు ఇంకా చిన్నపిల్లవాడిలా పడుకోవడం, అదీ భార్య ఒడిలో తలపెట్టుకుని పడుకోవటం నాకు విపరీతమైన కోపాన్ని తెప్పించింది.

## సభ్యత

వెళ్ళి నాలుగు చీవాట్లు వేసి వద్దామని కూడా అనుకున్నాను. కాని ధైర్యం చాలలేదు.

పావుగంట తర్వాత మళ్ళీ సీను మారింది. ఇద్దరూ ప్రక్కప్రక్కనే కూర్చుని భుజాల వరకూ దుప్పటి కప్పుకుని ఉన్నారు. అతడు తన తలని ఆమె తలకు ఆన్చి ఉన్నాడు. ఆమె అతన్ని చూసి చిలిపిగా నవ్వుతూంది. ఇక చూడలేక ఎదుటి బెర్తుకు మారాను. మా అమ్మాయి ప్రక్కన కూర్చుని చైతన్యవైపు చూశాను. 'మీ బాధ నాకు అర్థమైంది' అన్నట్లు నవ్వాడు. తర్వాత లేచి అక్కడ్నుంచి కదిలాడు. బహుశా అతనిలోనూ అసహనం పెరిగి తలుపుదగ్గర వెళ్ళి నిలబడ్డాడేమో అనుకున్నాను.



ఇంతలో ప్రక్క కూపేనుంచి అరుపులు వినిపిస్తే గబుక్కున లేచి వెళ్ళి చూశాను. ఆ అమ్మాయి నిలబడి అరుస్తూ ఉంది. చైతన్య ఆమె ప్రక్కన తల వంచుకుని నిలబడి వున్నాడు.

"ఏం జరిగిందమ్మా?" ఒకావిడ అడిగింది ఆ అమ్మాయిని.

"మా ఆయన టాయిలెట్‌కని వెళ్ళారు. ఆయనటు పోగానే వీడొచ్చి ఏ ఊరని అడిగాడు. హైదరాబాద్ అని చెప్పాను. 'అడ్రెసు చెప్పు. మీ ఇంట్లో ఎవరూ లేనప్పుడు వస్తాను. ఎంత డబ్బైనా ఇస్తాను' అంటున్నాడు" అంది దాదాపు ఏడుస్తూ.

అంతలో ఆమె భర్త వచ్చి చైతన్య కాలర్ పట్టుకుని "రాస్కెల్! ఎంత ధైర్యంరా నీకు" అన్నాడు.

"చెయ్యి తియ్యి మిస్టర్. నేను నీకు పోటీకి రాలేదు. ఆమె ఎప్పుడు ఫ్రీగా ఉంటే అప్పుడే వస్తానని చెప్పాను" అన్నాడు చైతన్య కొంత కూడా బెదరకుండా.

అతని ధైర్యం చూసి నాకు ఆశ్చర్యం వేసింది. అయితే అతని ప్రవర్తన ఎంతో బాధ కలిగించింది. 'అయినా తప్పు ఆ అబ్బాయిది కాదు. అతన్ని ప్రేరేపించేలా ప్రవర్తించిన ఆ జంటదే' అనుకున్నాను.

"స్కౌండ్రల్. ఆమె నా భార్యరా"

"అంటే మీరిద్దరూ భార్యాభర్తలా?" ఆశ్చర్యంగా అడిగాడు చైతన్య.

"ఏం డౌటా? నీకు రుజువులు చూపాలా?" వెటకారంగా అన్నాడు ఆ అమ్మాయి భర్త.

"అఖ్ఖర్లేదు. మీరిద్దరూ భార్యభర్తల్లా కనిపించారా అని ఇక్కడున్న వాళ్ళను చెప్పమనండి"

ఎవరూ మాట్లాడలేదు.

"మీ చేష్టలు చూస్తుంటే భార్యాభర్తలు కలిసి ప్రయాణం చేసినట్లు మాకెవరికీ అనిపించలేదు. వయసులో పెద్దవాళ్ళు, చిన్నపిల్లలు చూస్తున్నారన్న ఇంగిత జ్ఞానం లేకుండా మనం సభ్య సమాజంలో బ్రతుకుతున్నాం అన్న నిజాన్ని మరచి మీరు ప్రవర్తించిన తీరు చూసి భరించలేక అలా మాట్లాడాను. మీరు నిజంగానే భార్యాభర్తలైతే నన్ను క్షమించండి" అంటూ వచ్చి తన సీట్లో కూర్చున్నాడు.

వాళ్ళిద్దరి ముఖాలు నల్లబడ్డాయి అవమానంతో. ఇద్దరూ మెల్లగా కూర్చున్నారు తమ మధ్య కొంత దూరాన్ని వదలి.

చైతన్య వాళ్ళకు బుద్ధి చెప్పడానికే అలా ప్రవర్తించాడని అందరికీ అర్థమైంది. ఆ జంట ఇక జీవితంలో అలా సభ్యత మరచి ప్రవర్తించరని నాకు అనిపించింది.

మెచ్చుకోలుగా చైతన్య వైపు చూసి నవ్వాను. అతనూ నవ్వాడు 'మీరు చేయులేని పని నేను చేశాన'న్నట్టు.

**-సి.ఎస్.చంద్రశేఖర్**
**(చిత్తూరు)**